తుమ్ము, పిల్లి, ఒంటి బ్రాహ్మణుడు ఇలాంటివన్నీ అపశకునాలు; అశుభానికి పర్యాయ పదాలూనూ. వదినెమీద ఇష్టం ఉంది; కాని వదినె తుమ్మంటే మాత్రం భయం. అనుభవం అలాంటిది. చెల్లెలికి పెళ్ళి సంబంధం వస్తే అంతా భయమే, ఏమౌతుందోనని. చివరికి అనుకొన్నంతా జరిగింది. అయినా వదినె తుమ్ము కోరతాడేమిటి ఈ మరిది?



# వదినె తుమ్ము

యడవల్లి సోమలతాదేవి ..

ఆ రోజు శనివారం. మధ్యాహ్నం కాలేజీ నుండి ఇంటికి వచ్చిన తరువాత ఏమీ తోచక ఏదైనా కథ వ్రాద్దామని, కాగితంమీద కలం పెట్టబోతున్నాను. 'హాచ్!... హాచ్...హాచ్..' అంటూ మా వదిన తుమ్మటం ప్రారంభించింది. హతోస్మి! అమంగళము ప్రతిహతమగు గాక! అసలే ఏం వ్రాయటానికీ తోచక నేను చస్తూంటే "ప్రథమకబళంలోనే మక్షికాపాత" మన్నట్లు మొదట్లోనే యీ తుమ్ములొకటి. ఇకలాభం లేదు. ఎంతసేపు బుర్ర బద్దలు కొట్టుకున్నా 'అయిడియా'లు వచ్చి చస్తేగా! అసలు మనం ఏపనైనా ప్రారంభించేప్పుడు ఎవరైనా తుమ్మితే "మీవల్ల యిప్పుడీ పనికాదు., కాబట్టి యిక విరమించుకోండి" అని సూచించినట్లే.



అంత స్పష్టంగా చెప్పినాకూడా మనం ఆయాను కోలేక ఆ పనిని చేయబూనికొని, అది సరిగ్గా కాకపోతే, ఆ తుమ్మినవారిని తిడతాము. అందులో మావదిన తుమ్ములకు తిరుగు లేదనుకోండి! అందుకనే నేను వ్రాయాలనే వుద్దేశ్యాన్ని విరమించుకొని హాయిగా పడుకొని నిద్రపోయాను.

మా యింట్లో యిదీ వరస!! ఎవరు ఎప్పుడు ఏ పనిని ప్రారంభించటానికైనా మా వదినంటే భయపడతారు. మూఢ విశ్వాసాలంటే నమ్మకంలేని ఎంత ఆధునిక భావాలు కలవారికైనా, తుమ్ములు, పిల్లి, ఒంటి బ్రాహ్మణుడు మొదలైన శకునాలంటే కాస్త జంకుగానే వుంటుంది. ఆ.....ఎప్పుడూ తుమ్మేవాళ్లు తుమ్ములొక లెక్కా అని అంటారేమో! మనం కాస్త అజాగ్రత్తగా వున్నామో, అవి ఆటంబాంబులలాగా పనిచేసి వూరుకుంటాయి. అంతదాకా ఎందుకు! క్రిందటి సంవత్సరం మా పరీక్షలు ప్రారంభమయ్యే రోజున అన్ని శకునాలూ చూసుకొని, హడావుడిగా యింట్లోవాళ్లకు చెప్పేసి,భయ పడుతూనే గడప బయట కాలుపెట్టబోతున్నానో లేదో, మా వదిన హాచ్ ,హాచ్ మంటూ డజను తుమ్ములు తుమ్మిందాకా వూరుకోలేదు. అప్పుడు నాకాళ్ల క్రింద భూమి కదలుతున్నట్లు అనిపించింది. అప్పటికే చాలా టైమయింది. ఏదో శాస్త్రార్థం రెండడుగులు వెనక్కువేసి, కాస్త కూర్చొని, గుండెలో రైళ్లు పరుగెత్తుతుండగా మళ్లీ బయలుదేరి వెళ్లాను. చివరికి ఫలితం ఆ సంవత్సరం దండయాత్ర సాగించాల్సినంత దురవస్థ పట్టింది. అప్పటి నుండీ నాకుమాత్రం మా వదిన తుమ్ములంటే గురి కుదిరి, ఎక్కడికైనా వెళ్లాలన్నా, ఏదైనా కొత్త పనిని ప్రారంభించాలన్నా మా వదినకు పదివేల నమస్కారాలు చేస్తూంటాను. ప్చ్! కాని ఏం లాభం! నా నమస్కారాలదోవ నమస్కారాలదే, వదిన తుమ్ములదోవ తుమ్ములదే!

ఇంట్లో అందరి సంగతీ నేను చెప్పలేను కాని మా వదినకు నామీదమాత్రం సంపూర్ణానుగ్రహం కలిగిందనటంలో సందేహమేమీలేదు.

ప్రొద్దున్నే పక్కమీదనుంచి లేవటానికి భయం. ఒకటనేమిటి? ప్రతిదానికీ మా వదినకు తుమ్ములు రెడీమేడ్! ఒక్కొక్కసారి మా అన్నయ్యకు విసుగుపుట్టి "అబ్బ నీకీ తుమ్ములున్నాయని తెలిస్తే నిన్ను పెళ్లి చేసుకోకనేపోదును. వీటితో చచ్చిపోతున్నాం. ఎంతో పొరపాటు చేశాను" అనేవాడు. అప్పుడు వదిన 'ఫరవాలేదు లేండి. ఇప్పటికైనా మించి పోయిందేమీలేదు. విడాకులిచ్చేయండి. ఒకవేళ మీకు యివ్వటానికి బద్ధకంగా వుంటే నేనే యిస్తాను. యివిగో" అని నవ్వుకుంటూ

# వదినె తుమ్ము

రెండు విడి తమలపాకులు తెచ్చి అన్నయ్య కిచ్చేది. మేమంతా విరగబడి నవ్వేవాళ్లం.

ఆమె కాపరానికి వచ్చిన సంవత్సరమే, అంటే క్రిందటి సంవత్సరం నేను దండయాత్ర సాగించాను. అప్పుడు ఆమెతో మాట్లాడాలంటే కాస్త బెరుకుగా వుండేది. కాని యిప్పుడు ఆమె అంటే నాకు బాగా చనువు ఏర్పడింది. ఆపుకోలేక చివరికి ఒకరోజున "ఏం వదినా నీకీ తుమ్ములు మాయింటికి వచ్చిన తరువాతే రాసాగినాయా, లేక చిన్నప్పటినుండే వున్నాయా, లేక మధ్య ఏదైనా జబ్బులో వచ్చాయా?" అంటూ ఒక డిటెక్టివ్ పోజులో ప్రశ్నించాను. నేను వేసిన ప్రశ్న విని ఆమె చాలా బాధపడింది. బాధకాదూ మరి! ఇంట్లో ఎవరిపని చెడినా, ఎవరికేమైనా అయినా, ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానైనా ఆమెనే ఆడిపోసుకుంటా రాయెను! అందులో నా ప్రశ్న విన్న తరువాత వదిన సిగ్గుతో కుంచించుకుపోయి, "ఏమిటో వేణూ, నాకీ తుమ్ములు చిన్నప్పటినుండే వున్నాయుట. ఎవరికీ లేదు యీ ఖర్మ. నా వల్ల ఎందరికో అపకారం జరుగుతోంది. వాటి దుంపతెగా, ఎంత ఆపుకుందామన్నా ఆగవాయెను" అన్నది బాధగా.

పాపం! అసలే ఆమె లోలోపల బాధ పడుతూంటే నేను మరీ ఆమె మనస్సును నొప్పించానే అని విచారించాను. అందుకని పరిహాసోక్తులతో ఆమె విచారాన్ని పోగొట్టాలని అనుకొని "అది కాదు వదినా, మరి చిన్నప్పటి నుండీ నీకీవిధంగా తుమ్ములంటే, ఇన్నాళ్లూ

> తెల్లవారి పొడుపుతో ఒక కవిగారికి జారం అడిన నేరానికి ఆరునెలల కారాగార శిక్ష విధించారు. దేశం స్వతంత్రం కావడంతో దయదలచి మూడు నెలలకే విడుదల చేశారు.
>
> ఓమిత్రుడు ప్రేమకొద్దీ ఆతిథ్యం ఇచ్చి తన ఇంట్లో వుంచుకున్నాడు కవిగారిని. ఆయన క్షేమ సమాచారాలు తెలుసుకుందామని వచ్చిన మరొక మిత్రుడు కవిగారితో అన్నాడు—
>
> "దేవుని దయవల్ల జైలునుంచి విడుదలైనారు......సంతోషం"—అని.
>
> కవి: "జైలునుంచి విడుదలైన దెవడయ్యా! మొన్నటిదాకా తెల్లవాడి జైల్లో వున్నాము. ఇప్పుడు నల్లవాడి జైల్లో వున్నాము. అంతే."

మావాళ్లు ఎట్లా వేగారు?" అన్నాను.

"మావాళ్లకు అలవాటైపోయింది. 'నిత్యం చచ్చేవాడికి ఏడ్చేవాళ్లెవరన్న'ట్లు ఎప్పుడూ వున్న తుమ్ములకు తప్పేమిటి? అయినా పడిశం భారం వల్ల వచ్చేవాటినీ, ముక్కులో గడ్డి పెట్టుకొని బలవంతాన తెప్పించుకుండే వాటినీ, ఎప్పుడూ వుండేవాటినీ మావాళ్లు పాటించి అపశకునంగా భావించరు. అవి వాళ్లకు ఎప్పుడూ హాని చేయనూలేదు."

"వాటి దుంపతెగ! ఆ తుమ్ములకూ కాస్త పక్షపాతబుద్ధి వున్నట్లుంది. లేకపోతే మీ వాళ్లను ఏమీ చేయకపోవటమేమిటి? వాటి ప్రభావమంతా మామీదనే చూపించటమేమిటి?" నవ్వుతూ అన్నాను.

"ఏమోనయ్యా వేణూ, అది వాళ్ల వాళ్ల మనఃప్రవృత్తులను బట్టి వుంటుంది. మరి మావాళ్లు నా తుమ్ములను లెక్క చేయరుకదా, వాళ్లకు యింతవరకూ ఏ విధమైన అమంగళమూ సంభవించలేదు. అనకూడదుకాని మరి మీకేమో చాదస్తాలూ నమ్మకాలూ ఎక్కువ."

"బాగానేవుంది వరస! పోనీ యిందులో అబద్ధమేముంది వదినా, అన్నీ నీ కళ్లముందరే జరుగుతున్నాయిగా. సరేకాని నేకొక్క విషయం అడుగుతాను చెప్తావా?"

"అడగదలచుకొన్నవన్నీ అడుగు. తీరికగా కూర్చున్నది అందుకేగా! అన్నిటికీ సమాధానం చెప్తా."

"మరి నీ పెళ్లినాడు.....అంటే మాఅన్నయ్య పెళ్లినాడు నీ తుమ్ములను ఎట్లా ఆపుకున్నావు వదినా! ఉత్తప్పుడే యింత పట్టింపుగా వుంటుందే....అట్లాంటప్పుడు పెళ్లప్పుడు ఎంత వ్యవహారం వుంటుంది. వాటన్నిటికీ యిలాగా తుమ్మేనా?"

"చెప్పానుగా.... మావాళ్లకు పట్టింపులేదని.... పెళ్లిపనులు ప్రారంభించబోతూంటే తుమ్ములే... గౌరీపూజ చేయబోతూంటే తుమ్ములే..... అబ్బో, ఒకటనేమిటి! అన్నిటికీ తుమ్ములే..."

"మరి మంగళసూత్రం కట్టేప్పుడు కూడా తుమ్మేనా?"

"నీవక్కడే వున్నావుగా, వినలా?"

"నేనేదో హడావుడిలో దూరంగా నిలబడి స్నేహితులతో మాట్లాడుతున్నాను. ఒకవేళ తుమ్మినా ఆ సన్నాయి, బాండు మేళాల గొడవలో వినబడుతుందా?"

"దేవుడిదయవల్ల అప్పుడుమాత్రం ఎందు వల్లనో తుమ్ము రాలేదు!"

"బతికించావు! అందుకనే యీ మాడియ వరకూ మా అన్నయ్య క్షేమంగా....."

"చాల్లే వూరుకోవయ్యా! ఏమి మాటలు..."

"పోనీలేకాని వదినా, నేకో సలహా చెప్తా

వింటావా? అందువల్ల నీకూ యిబ్బంది వుండదు. మాకూ యిబ్బంది వుండదు."

"ఏమిటా సలహా?"

"అబ్బే ఏం కష్టంలేదు. చాలా తేలిక. ఇక్కడనుంచి నీకు ఎప్పుడు తుమ్ము వచ్చినా నోటికి గుడ్డ అడ్డంపెట్టుకొని ఎవరికీ వినపడకుండా నెమ్మదిగా తుమ్మటానికి ప్రయత్నించు."

"ఏడిసినట్లేవుంది! అదెట్లా సాధ్యమౌతుందీ. ఎంత మెల్లిగా తుమ్మినా పైకి వినపడకుండా వుంటుందా?"

"అదే ప్రయత్నించాలి. మొదట కాస్త కష్టమనిపించినా, ఆతరువాత అదే అలవాటవుతుంది."

"సరే అట్లాగే ప్రయత్నిస్తాలే" అంటూ వదిన నవ్వుకుంటూ వంటింట్లోకి వెళ్లింది. నేనిచ్చిన సలహావల్ల యికమీదట తుమ్ముల బెడద చాలా వరకు తగ్గుతుందని ఆశించి నాలో నేను సంతృప్తి చెందాను.

* * * *

"ఒరే వేణూ, స్టేషన్‌కి వెళ్లరా. బండి వచ్చే టైమయింది."


"అబ్బా, యింకా చాలా టైముందమ్మా. ఇవాళ బండి గంట లేటుట."

"బాగానేవుంది. ఇవ్వాళే ఆలస్యం కావాలీ. పాపం వాళ్ళు వచ్చేప్పటికే పొద్దుపోతుందో ఏమో....."

"దానికి మనమేం చేస్తాం?" అంటూ నేను కుర్చీలో కూలబడి పేపరు చదవసాగాను. "ఒరే యింకా కూర్చుంటావేమిరా? కాస్త ముందుగా వెళ్లి స్టేషనులోనే కూర్చొని చదువుకోరాదురా!" అంటూ అమ్మ పోరసాగింది. "అట్లాగేలే అమ్మా" అని ఇక కూర్చుంటే అమ్మ బతకనీయదని తిన్నగా స్టేషన్‌కి బయలుదేరా.

ఇంతకూ అసలు విషయమేమిటో చెప్పొద్దూ! మా చెల్లెలు రాధను చూడటానికి ఆరోజున పెళ్లివారొస్తున్నారు. ఇంతకు ముందు మూడు సంబంధాలైనాయి. ఇది నాలుగవది. సరీగ్గా సెలవులేని రోజునే వాళ్లకు ముహూర్తం కుదిరినట్లుంది. లేకపోతే ఏ ఆదివారమో రాకూడదూ! నాన్నగారు మధ్యాహ్నం వస్తానని చెప్పి తప్పనిసరిగా ఆఫీసుకు వెళ్లారు. అన్నయ్యేమో ఏదో ఆఫీసు పనిమీద వూరికి వెళ్ళాడు. ఇక బాధ్యతంతా నామీద పడింది. వాళ్లను స్టేషనునుండి యింటికి తీసుకురావాలి, మర్యాద చేయాలి. నాన్నగారు వచ్చిందాకా మాట్లాడాలి. ఈ కారణాలవల్ల ఆరోజున మావాళ్ళు నన్ను కాలేజీకి వెళ్లకుండా యింట్లో వుండమని శాసించారు.

అంతా బాగానే వుందికాని ఒక్కటే చిక్కు వచ్చిపడింది. అది కాస్త గట్టిచిక్కే. పెళ్లివారు



'శాంతి యుత పరిష్కార సమితి ప్రొద్దుట సమావేశమైంది. ఇక్కడే!'

చిత్రం — ఎన్. గోపాల్ కృష్ణ (న్యూఢిల్లీ)

వస్తారు, పిల్లను చూస్తారు, వెళ్తారు. కాని ఈ తతంగమంతా జరిగేదాకా అంటే కనీసం ప్రొద్దుటినుండీ సాయంత్రందాకా మా వదిన తుమ్మకుండావుండొద్దూ! ఏ సందర్భంలో తుమ్మినా అపశకునమే. ఎట్లా యీ గండం గడవటం! అంతకుముందే మా అమ్మ వదినను యీ సందర్భంలో ఏదోవిధంగా పుట్టింటికైనా పంపాలని ఎంతో తహతహలాడింది. కాని అమ్మ చేసిన ప్రయత్నమంతా నిష్ప్రయోజనమైంది. అవును ఏదో ఒక వంక వుండొద్దూ మరి! పుట్టింటివారు ఆమెను పంపమనైనా వుత్తరం వ్రాయాలి, ఆమె వెళ్తాననైనా అనాలి, లేక వాళ్ళింట్లో ఏ శుభకార్యమైనా, ఎవరికైనా జబ్బైనా రావాలి. ఇవన్నీ కాకపోతే వదిన పురిటికైనా వెళ్ళాలి. వీటిల్లో ఏదీ లేనిదే వూరికేనే పుట్టింటికి పొమ్మంటే ఆమె మనసు కష్టపెట్టుకోదూ! ఇవన్నీ కాకపోయినా ఆ కాస్సేపూ ఏ పొరుగింటికో, స్నేహితురాండ్ర యిళ్ళకో పంపుదామంటే "చూశారా, మా ఆడబిడ్డను పెళ్ళివారు చూడటానికి వస్తూంటే నన్ను మీ యింటికి పంపారు" అని ఆమె వాళ్ళతో చెప్పదూ! అదొక అప్రతిష్ఠ!

ఎన్నివిధాల ఆలోచించినా ఏ వుపాయం దొరకనందువల్ల మే మందరమూ గుండె రాయి చేసుకొని దానికి అంటే మా చెల్లెలు రాధకు పెళ్ళి అయ్యే గీత వుంటే ఎన్ని తుమ్ములు తుమ్మినా ఏమీ కాదంటూ మొండి ధైర్యం వహించాము. మరి అంతకంటే గత్యంతరమేముంది! పోనీ మా అవస్థను కనిపెట్టి తనే ముందుగా జాగ్రత్త పడేంత గడసరిది కాదు వదిన. అట్లాగనక వుంటే మాకీ అవస్థలన్నీ ఎందుకు వస్తాయి? నేను ఆమెకు చెప్పిన సలహావల్ల పరిస్థితులలో కొద్దిలో కొద్ది అయినా మార్పు రావచ్చుని ఆశించినా, ఏమో ఎప్పటికేం ముప్పు వాటిల్లుతుందో నేనేం చెప్పగలను! వదిన పోనీ ఎక్కడైనా లోపల వుంటుందా అంటే అదీ లేదు. ప్రతిదానికీ తనే సిద్ధమౌతుంది.

ఈ సంబంధమే కనక కుదిరి పెళ్ళయితే, ఆ తరువాత రాధకు పుట్టబోయే పిల్లకో పిల్లాడికో పుట్టు వెంట్రుకలు తిరుపతి కొండ మీద తీయిస్తామని అమ్మ మొక్కుకుంది. నేనూ వేయి దేవుళ్ళకు మొక్కుకుంటూ స్టేషనుకు వెళ్ళాను. గంటసేపు స్టేషనులో పడిగాపులు పడివున్న తరువాత చివరికి బండి వచ్చింది. అతి కష్టంమీద ఆ జనసమ్మర్దంలో పెళ్ళివారిని కనుక్కోగలిగాను. తల్లీ, తండ్రీ, పిల్లవాడూ వచ్చారు. వారికి మా నాన్నగారు స్వయంగా రానికారణం చెప్పి, ఒక జట్కాను మాట్లాడాను. అందులో అందరమూ ఎక్కి కూర్చున్నాం. కాస్సేపటికి జట్కా తిన్నగా మా యింటి ముందర ఆగింది. ముందు నేను అందులోంచి దిగాను. ఆ తరువాత వాళ్ళు ముగ్గురూ జట్కాలోంచి దిగారు. "లోపలికి దయచేయండి" అంటూ వాళ్ళను ఆహ్వానిస్తూ నేను లోపలికి దారితీశాను. వాళ్ళు ముగ్గురూ లోపలి గడపలో కాలు పెట్టారో

లేదో "హాచ్" అని తుమ్ముకుంటూ మా వదిన కాళ్ళు కడుక్కోటానికి నీళ్ళు కాబోలు చెంబుల్లో తీసుకొని ఎదురుగుండా వచ్చింది. అనుకున్నంత పనీ అయింది. నా ప్రాణం గతుక్కుమన్నది. అసలే వాళ్ళు యిద్దరో లేక నలుగురో రాక ముగ్గురు వచ్చారే అని నేను మథన పడుతోంటే యిదొక అవాంతరం. వచ్చినవాళ్ళు తెల్లబోయారు. అమ్మ సంగతి సరేసరి, మనసులో మనసు లేదు. "బాగా జలుబు చేసినట్లుంది. లోపలకు వెళ్ళి ఏమైనా మందు వేసుకో సావిత్రీ" అంటూ "కాళ్ళు కడుక్కోండి వదినగారూ!" అన్నది వాళ్ళ మధ్దేశిస్తూ. వదిన మారుమాటాడకుండా లోపలకు వెళ్ళింది. తరువాత వాళ్ళకు జరగ వల్సిన మర్యాదలన్నీ సక్రమంగానే జరిగినాయి. ఈలోపల మా నాన్నగారు ఆఫీసుకు సెలవు పెట్టి రానే వచ్చారు. ఇంతసేపూ మా రాధ బోనులో పెద్ద పులిలా మారుమూల గదిలో ఎక్కడో నక్కి కూర్చుంది. మా వదిన కూడా ఆ కాస్సేపూ ఆడబిడ్డను అంటిపెట్టుకొనే వున్నది.

మధ్యాహ్నం భోజనాలైన తరువాత హాల్లో అందరమూ సమావేశమైనాము. ఇక రంగంలో రాధ ప్రవేశించటమే తరువాయి. మా అమ్మ రాధను తీసుకొరావటానికి లోపలికి వెళ్దామని లేచిందో లేదో మా వదిన మళ్ళా "హాచ్" మంటూ ఒక ఘోరమైన తుమ్ము తుమ్మింది. అక్కడ వున్నవారి అందరి మొహాలూ వెలా వెలా పోయినాయి. అమ్మ ఒక్క క్షణంసేపు ఆగి లోపలికి వెళ్ళి రాధను తీసుకువచ్చి కూర్చోపెట్టబోతూంటే మరొక తుమ్ము తుమ్మింది వదిన గడపలో నిల్చుని. ఇక్కడికి ముఖ్యంగా మూడు తుమ్ములైనాయి. ఇక యీ సంబంధానికి గూడా నీళ్ళు ఒదులు కోవాల్సిందే! మా అందరికీ వదినను నమిలి మింగివేద్దామన్నంత కోపం వచ్చింది. పాపం రాధ కూడా చిన్నపుచ్చుకుంది. పిల్లవాడి తల్లి యిక ఆపుకోలేకపోయింది కాబోలు! "పాపం ఆ అమ్మాయికి బాగా జలుబు చేసినట్లుంది. ఆ జలుబు పూర్తిగా నయమైన తరువాతే మమ్మల్ని రమ్మని వ్రాయకపోయారా వదినగారూ!" అన్నది హేళనగా.

నా నవనాడులూ కృంగిపోయినాయి. చెప్పొద్దూ! ఆ క్షణంలో నాకు వదినమీద వున్న గౌరవమంతా పోయి "యీ శకునాల పక్షి మా కెక్కడ దాపురించిందిరా భగవంతుడా" అనిపించింది. నే నిచ్చిన సలహాను ఏ గంగలో కలిపావు అన్నట్లు కోపంగా చూశాను ఆమె వైపు. ఆమె వైపు నేను అలా చూడటంతో ఏమనుకున్నదో ఏమో మెల్లిగా లోపలకు జారుకుంది.

## వదినె తుమ్ము

"ఎప్పుడో యింతకుముందే జలుబు చేసినట్లున్నదండీ! అయినా యీ తుమ్ముల నేమీ తప్పుగా పాటించక్కరలేదు లెండి" అన్నది అమ్మ నయానా భయానా అంత మోహం చేసుకొని సమర్థిస్తున్నట్లుగా. వాళ్ళేమీ మాట్లాడలేదు. ఈ గొడవ తన కేమీ పట్టనట్లుగా, క్రీగంట రాధను చూస్తున్నాడు పిల్లవాడు. తరువాత రాధచేత పాటా అదీ పాడించి, ఏవేవో ప్రశ్నలను వేసి పరీక్షించారు.

నాన్నగారు వారితో కట్న కానుకల విషయా లేవో మాట్లాడారు. నేను అంతకుముందే అక్కడినుంచి వచ్చి మనస్సు సరిగ్గా లేనందున నా గదిలో పడుకున్నాను.

ఆ సాయంత్రం బండికి వాళ్ళను నాన్నగారూ నేనూ స్టేషనుదాకా వెళ్ళి మర్యాదగా సాగనంపాము. వాళ్ళు వెళ్ళిన తరువాత ఏసంగతి తెలియజేస్తామని అన్నారు. ఎప్పుడైతే మా వదిన తుమ్మిందో అప్పుడే ఆ సంబంధం కుదిరేది కాదని మేమంతా నిరాశ చేసుకున్నాం.

వాళ్ళు వెళ్ళిన తరువాత యింట్లో మా వదినమీద ఏం గాలిదుమారం చెలరేగుతుందోనని నా ప్రాణం తల్లడిల్లిపోయింది. అసలు మా అమ్మ చాలా మంచిది. వదిన కాపురానికి వచ్చినప్పటినుండీ ఆమె ఎన్ని మంచి సందర్భాలలో తుమ్మినా, ఏం జరిగినా అమ్మ ఆమెను పల్లెత్తుమాట అని ఎరుగదు. కాని యీ సందర్భం సహించరానిది. అమ్మ స్వభావం నాకు తెలిసినా యీ విషయంలో వదినను ఎంత తిడుతుందోనని భయపడ్డాను. కాని స్టేషన్నుండి యింటికి వచ్చేప్పటికే, ఎక్కడి



వాళ్ళు అక్కడ, అంతకుముందు ఏమీ జరగనట్టే ప్రశాంతంగా తమ తమ పనులు చేసుకుంటున్నారు. నేను ఆశ్చర్యపడ్డాను. ఇంత సహనం మా అమ్మకు వుందని నేను కల్లో కూడా అనుకోలేదు. మరొక గయ్యాళి అత్తగారైనట్లయితే యీపాటికి ఎంత రభస చేసేదో! మా నాన్నగారు కూడా ఆ ప్రసక్తి ఏమీ తేలేదు.

చూడటానికి కుర్రా డెంతో బాగున్నాడు. బి. ఏ. ప్యాసైనాడట. నాలాగా గడుగ్గాయి కాకుండా ఎంతో వినయ విధేయతలు కలవాడుగా కనపడ్డాడు. మా రాధకు తగినవాడుగా వున్నాడు. వాళ్ళు ఒప్పుకుంటే బాగుండునని నాకు తోచింది.

వెళ్ళిన పదిహేను రోజులకు గావాల్ను వాళ్ళ దగ్గరనుండి జాబు వచ్చింది. ఏం వ్రాశారో చదవాలని నాకు ఆత్రం ఎక్కువైంది. అందులో తమకు పిల్ల నచ్చిందట కాని కట్నం కనీసం యింకా రెండువేలైనా ఎక్కువ యిస్తేనే కాని తాము పిల్లను చేసుకోమని వ్రాశారు.

జాబును చదవగానే మా నాన్నగారు మండి పడ్డారు. "మనుష్యులన్న తరువాత మంచీ మర్యాదా వుండాలి. ఇక్కడ మూడువేలని ఒప్పుకొని అక్కడకు వెళ్ళిన తరువాత వందాకాదు, రెండు వందలూ కాదు ఏకంగా రెండువేలు ఎక్కువ అడుగుతారా? డబ్బు కింత గడ్డితినే వాళ్ళు నా పిల్లనేం సుఖపెడతారు? వాళ్ళు వచ్చి నా కాళ్ళమీద పడ్డాకాని నా పిల్లను వాళ్ళ కివ్వను" అంటూ కస్సు మన్నారు.

మేమంతా మొదటే అనుకున్నాంగా యిదెట్లాగూ కుదిరేది కాదని, అందుకని దాన్ని గురించి ఎక్కువగా విచారించలేదు. కాని మా వదినమీద ఒక విధమైన దురభిప్రాయ మేర్పడింది. అయినా అమాంతం రెండువేలు ఎక్కువ అడగటం యిష్టంలేక కాదూ!

మరొక తమాషా. మా అమ్మ యీ సంబంధం స్థిరపరచమని వెంకటేశ్వర్లుకు మొక్కుకుంది కదా! ఆయన మొక్కుబడి కంటే మా వదిన తుమ్ములే ఎక్కువ ప్రభావం చూపగలిగినాయి!

ఏమైతేనేం ఆ సంబంధం చిట్లిపోయిన తరువాత మా నాన్నగారు రాధకు అప్పట్లో పెళ్ళి చేయదలచుకోక, అంతకుముందే మెట్రిక్ ప్యాసైనందువల్ల శుభ్రంగా దాన్ని కాలేజీలో జేర్పించారు.

అప్పటికి ఆ సంబంధం చిట్లిపోయి నాలుగైదు నెలలైంది. ఒక రోజున మధ్యాహ్నం మేమంతా భోజనం చేస్తూండగా, నా స్నేహితుడు కేశవరావు అకస్మాత్తుగా వచ్చాడు. కుశలప్రశ్నలైనాక అతన్ని కూడా భోజనానికి రమ్మన్నాము. భోజనం చేస్తున్నప్పుడు నేను

అతన్ని "ఎక్కడనుండి వస్తున్నావోయి?" అని ప్రశ్నించాను.

"ఏలూరునుండి వస్తున్నాను" అన్నాడు క్లుప్తంగా కేశవరావు. ఏలూరు అనగానే నాకు చటుక్కున జ్ఞాపక మొచ్చింది......మొన్న కుదరని సంబంధం ఏలూరుదే. ఒకవేళ వాళ్ల సంగతేమైనా యితనికి తెలుసునేమో! నాలో ఉత్కంఠ ఎక్కువైంది. "నీకు అక్కడేం పని?" అని అడిగాను. అతను "మా అత్తగారి వూరోయి" అని సందేహిస్తూ చెప్పాడు.

"ఇదివరకు విజయనగరంలో వుండేవారుగా?"

"అక్కడనుండి ట్రాన్స్‌ఫర్ అయినందు వల్ల ప్రస్తుతం ఏలూరులోనే వుంటున్నారు."

"ఓహో అలాగా" అనేసి వూరుకున్నాను తరువాత నెమ్మదిగా ఆరా తీయవచ్చుననే వుద్దేశ్యంతో.

భోజనాలైన తరువాత మే మిద్దరం నా గదిలో కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకున్నాం. కబుర్ల మధ్యలో కేశవరావు "సరే గాని మా అత్తగారి పక్కింటి అమ్మాయేటగా మొన్నీమధ్య మీ చెల్లెలిని చూసి వెళ్లింది?" అన్నాడు. 'ఆడబోయిన తీర్థ మెదురైంది.' "నీ కెట్లా తెలుసు?" అన్నాను ఆత్రంగా.

"నా కన్నీ తెలుసులేవోయి!"

"ఎట్లా తెలుసునో చెప్పరాదూ!"

"ఏముందీ, మా అత్తగారూ వాళ్లకూ, వాళ్ల పక్కింటి సుబ్బారాయుడిగారి వాళ్లకూ బాగా స్నేహితమట. తరుచూ ఒకరింటికి ఒకరు వస్తూ పోతూ ఉంటారట. ఇక్కడకు రావటం, పిల్లను చూసి చేసుకోనటం, యిదంతా మా శ్రీమతి యిచ్చిన ఇన్‌ఫర్మేషన్‌లే. ఆ సుబ్బారాయుడి కూతురికీ మా ఆవిడకూ ప్రాణ స్నేహితమట!"

"అది సరేకాని వాళ్లు మా చెల్లెలినే చూసినట్లు నీకు ఎట్లా తెలుసు?"

"అబ్బ యింత అమాయకుడి వేం నేనూ, ఏదో మాటల సందర్భాన ఫలానా వూళ్లో ఫలానావారి పిల్లను చూసి వచ్చారని మా శ్రీమతి చెప్పింది. అప్పుడు తెలుసుకొని చెప్పాను మీరు నాకు తెలుసునని."

"సరే కాని వాళ్లు చేసుకోని కారణ మేమిటో కూడా తెలుసునా?"

"మీకు వాళ్లు వ్రాయలా?"

"వ్రాశారులే కాని ఆ కారణమంత సమంజసంగా లేదు. అందుకని."

"కట్నం ఎక్కువ కావాలని అడగటమేనా? అబ్బాయీ, అదంతా శుద్ధ బూటక మనుకో! ఇంతకీ మీ రదృష్టవంతులు!" అన్నాడు ఏదో రహస్యం కనిపెట్టినవాడిలా మొహం పెట్టి.

"ఏ విధంగా అదృష్టవంతుల మంటావు?



**'వెన్నెల రేయి'** చిత్రం — జి. రంగారావు (విజయవాడ)

అబ్బ నా ప్రాణం తీయక అసలు విషయ మేమిటో త్వరగా చెప్పు" అన్నాను చిరాకుగా.

"నేను చెప్పిందాకా నీవు ఆగితేగా. మధ్యలో అడ్డు ప్రశ్న లేయకుండా విను. వాళ్లు మీ రాధను చేసుకోని కారణం వేరేవుంది. అది మహా తమాషాగా ఉందిలే. ఏమీ లేదు, వాళ్ళకు మీ పిల్లా, కట్న కానుకలూ అన్నీ నచ్చాయట కాని..............."

"కాని?"

"అదుగో మళ్ళా మాట్లాడుతున్నావు. విను. వాళ్ళు వచ్చి మీ గడపలో కాలు పెట్టబోతూండగా, మీ అమ్మ లోపలినుండి పిల్లను తీసుకురావటానికి వెళ్ళబోతుండగా, తదుపరి ఆ పిల్ల వచ్చి కూర్చోబోతూండగా, మీ యింట్లో ఎవరో ఒక అమ్మాయి వుందటే? ఆవిడ తుమ్మిందట. అసలే వాళ్ళకు మూఢ విశ్వాసాలూ, చాదస్తాలూ ఎక్కువ. అందులో వాళ్ళబ్బాయికి మూర్ఛలు ఉండటంవల్ల....."

"ఏమిటీ మూర్ఛలా?" ఆశ్చర్యంగా అడిగాను.

"పొంతం విన్నదాకా నిన్ను మాట్లాడవద్దన్నానా? ఆ.....ఆ అబ్బాయికి మూర్ఛ లుండటంవల్ల, ఆ పిల్ల ప్రతిదానికీ తుమ్మటంవల్ల ఆ అబ్బాయికి మూర్ఛ వచ్చినపుడు, మీ పిల్లను చేసుకున్న వేళా విశేషాన ఎప్పుడు మూర్ఛలోనే ఆ ప్రాణం కాస్తా గుటుక్కుమంటుందోనని హడలిపోయి, అదొక వంకపెట్టి వ్రాశారట."

"అంత నమ్మకాలూ, చాదస్తాలూ ఉన్న వారు మరి పిల్లను చూడటానికి ముగ్గురు వచ్చారేం? అసలు ఏ పనికీ ముగ్గురు కలిసి వెళ్ళరుగా!"

"ఏమిటో వాళ్ళ మొహం!"

"ఇంతకూ నేననుకున్న కారణంవల్లనే మానుకున్నా రన్నమాట. ఆ ఎవరో కాదు కేశవరావు ఆ తుమ్మింది మా వదినే... ఎంత ప్రమాదం తప్పిపోయింది!" అన్నాను నేను సంతోషంతో వుక్కిరి బిక్కిరి అవుతూ. ఇన్నాళ్ళనుండీ నా మనస్సులో ఉండి బాధిస్తున్న అనుమానం నిజమైంది. నాకు అప్పటినుండీ వాళ్ళు నిజంగా కట్నానికే ఆశపడ్డారో లేక తుమ్మటంవల్లే మానుకున్నారో తెలుసుకోవాలని చాలా కుతూహలంగానే వున్నది. డిటెక్టివ్ దొంగ ఆచూకీ తెలుసుకొని, నేరస్థుని పట్టుకున్న... చెప్తే అతను ఎంత సంతోషిస్తాడో అంత సంతోషం నాకు కలిగిందనటంలో సందేహ మేమీ లేదు. ఆ సంతోషంలో నేను కేశవరావును వారం రోజులదాకా మా యింట్లోనుండి కదలనీయ దలచుకోలేదు. అతనికి అసలు యీ సంగతులన్నీ అతని శ్రీమతి ద్వారా తెలిసినాయి కాబట్టి, ఆమెకు నా కృతజ్ఞత తెలపటమెలాగా అని ఆలోచించి "ఈసారి నీవు ఒంటరిగా కాకుండా మీ శ్రీమతితోసహా వచ్చి మా గృహం పావనం చేయాలోయి!" అన్నాను.

కేశవరావు నా అభిప్రాయాన్ని తెలుసుకున్నట్లున్నాడు. చిరునవ్వు నవ్వి "అట్లాగేలే కాని అసలు ముందర మా యింటికి రానీ, తరువాత మీ యింటికి తీసుకువస్తా. సరే కాని యింకో చిత్రమైన విషయ మేమిటంటే ఆ అబ్బాయికి పిచ్చి పిచ్చి నమ్మకాలేమీ లేవట. అందుకని మీ రాధనే చేసుకుంటానని గొడవ చేసినా తల్లిదండ్రులు 'ససేమిరా' అన్నారట. అప్పటినుండీ తనిక పెళ్ళే చేసుకోనని అంటున్నాడట. కొన్నాళ్ళ తరువాత అతనే ఒప్పుకుంటాడని వాళ్ళు మాట్లాడకుండా వూరుకున్నారట. అయినా ఆ అబ్బాయి సంగతి తెలిసినవాళ్ళెవరూ పిల్లనిస్తామని రారట, ఎవరో మాబోటి తెలి



"ఏకాగ్రత" — ఫొటో : ప్రభాకర్ మహాదిక్

యువివాళ్ళ తప్పు" అన్నాడు.

"బాగా చేశాడు వెధవ. లేకపోతే ఏ మూర్ఖ వచ్చినప్పుడో చచ్చి వూరుకొని, కట్టుకున్నదాన్ని ఉసూరుమంటూ ఏడ్పించటమేగా!" అన్నాను కసిగా.

"ఇంకా వయం తనకు కట్నం కానుకలా అవసరంలేదని, పిల్ల నచ్చిందనీ, మీ యింటికి వచ్చి చెప్పి చేసుకుంటా ననలేదు."

"ఏడిశాడు చవట. మేమంత దద్దమ్మలం అనుకున్నాడేమో! వాడి సంగతి పూర్తిగా తెలుసుకోనిదే ఎవరిస్తారోయ్ పిల్లను."

"అబ్బో చాలామట్టుకు వుందే వ్యవహారం. మీ వదిన కనక తుమ్మనట్లయితే తెలిసేది మీ ప్రతాపం" అంటూ కేశవరావు విరగబడి నవ్వసాగాడు.

"నిజమే" అనుకుంటూ నేనూ హాయిగా నవ్వాను.

వెంటనే లోపలికి వెళ్ళి ఆ శుభవార్తను అందరికీ చెప్పి క్షణంలో వదినమీదవున్న

## వదినె తుమ్ము

దురభిప్రాయాన్ని అందరి మనస్సుల్లోనుండీ తొలగింపజేశాను. పాపం! ఈ నాలుగైదు నెలల్లోనూ వదిన ఎంతగానో మారిపోయింది. ఎప్పుడూ నవ్వుతుండేదల్లా, ఎంతో విచారంగా ఉండేది. నేను చాలాసార్లు ఆమె విచారాన్ని పోగొట్టాలని ప్రయత్నించి విఫలుడి నయ్యాను. "నీవేం చేశావు, దానికి పెళ్ళయ్యే శుభఘడియ యింకా రాలేదేమో!" అంటూ మా అమ్మ కూడా ఆమెకు నచ్చ చెప్పింది కాని ఆమె ఎవరి మాటా వినలేదు.

ఇప్పుడీ సంగతి వింటే వదిన ఎంత సంతోషిస్తుందోనని వూహించుకుంటూ, ఆమెను వెతుక్కుంటూ వెళ్ళాను. దొడ్లో మల్లె పందిరిక్రింద ఏదో ఆలోచిస్తున్న దానిలా ఒంటరిగా కూర్చుంది. "వదినా!" అని మెల్లగా పిలిచాను. ఆమె వులిక్కిపడి వెనక్కు తిరిగి "ఏమిటి వేణూ!" అన్నది తన విచారాన్ని కప్పిపుచ్చుతూ.

"ఏం లేదు వదినా, మా కందరికీ నీ వింత ఉపకారం చేసినందుకు నిన్నభినందించటానికి వచ్చాను. నీ మేలెన్నటికీ మరువలేము" అన్నాను కృతజ్ఞతాపూర్వకంగా.

నా ధోరణి ఆమెకు అర్థం కానందువల్ల తెల్లపోతూ "మేలేమిటి వేణూ, అందులో నేను చేయుట మేమిటి? అసలే నేను బాధ పడుతోంటే యింకా నన్ను పరిహాసం ఎందుకు చేస్తావు?" అన్నది జాలిగా. "పరిహాసం కాదు వదినా నిజంగా అంటున్నాను" అంటూ యింకా ఎక్కువసేపు ఆమెను సందిగ్ధావస్థలో వుంచదలచక వున్న విషయమంతా సవిస్తరంగా చెప్పాను. అంతా విని "ఇందులో నేను చేసిన దేముంది వేణూ అంతా ఆ భగవంతుని దయ" అన్నది వేదాంత ధోరణిలో.

"మొత్తానికి నీ తుమ్ములతో వాళ్ళను భలేగా హడల గొట్టావు వదినా" అంటూ నవ్వ సాగాను. ఆమె కూడా నాతోపాటు నవ్వింది. ఆమె హృదయభారం అంతటితో తీరినట్లు నేను గ్రహించాను. "ఇకమీదట నేను ఏ మంచి పని చేయదలచుకొన్నా, మొదట నీవు తుమ్మాలి వదినా" అన్నాను.

"సరే చూద్దాంలే" అనుకుంటూ వదిన లోపలికి వెళ్ళిపోయింది.

ఈ సంగతి విని అన్నయ్య ఎంత సంతోషిస్తాడో అనుకున్నాను. "ఆ నీ మొహం యిందులో మీ వదిన దేముందిరా. అంతా పరమేశ్వరుని అనుగ్రహం" అన్నాడు నిర్లక్ష్యంగా. సరే ఎవరెట్లా అనుకుంటే నాకేం!

అప్పటినుండీ మా యింట్లో అందరికీ అందులో ముఖ్యంగా నాకు మా వదిన తుమ్మంటే రెట్టింపు గురి కుదిరింది. ఏ పనికైనా ముందు ఆమె తుమ్మితేనే నాకు శుభం చేకూరుతుంది. నా దురదృష్టమేమో లేక మా వదిన తుమ్ములకు గిరాకీ ఎక్కువ కావటం వల్లనో ఏమో! నాకు అవసర మున్నప్పుడు గంగను భగీరథుడు ప్రార్థించినట్లు ప్రార్థించినా, ఆ గంగకు భగీరథునిమీద అనుగ్రహం కలిగింది కాని, మా వదిన తుమ్ములకుమాత్రం నా మీద అనుగ్రహం కలగటం లేదంటే నమ్మండి!!! ★